# మనం
## కరీంనగర్
జగిత్యాల- రాజన్న సిరిసిల్ల- పెద్దపల్లి -మంచిర్యాల- కొమురంభీమ్

ఆదివారం | 16 | ఏప్రిల్ | 2023 | పేజీలు : 6


## టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన గెల్లు



4 లో

## వంద శాతం సబ్సిడీ ఇస్తున్న ఏకైక పథకం

# దళిత బంధు

### మంత్రి గంగుల

కరీంనగర్ బ్యూరో, ఏప్రిల్ 15 (మనం న్యూస్)ః దళితులను సామాజికంగా, ఆర్థికంగా ఎదిగేందుకు అమలు చేస్తున్న దళిత బంధు లబ్ధిదారులకు వంద శాతం సబ్సిడీ ఇస్తున్న ఏకైక పథకం అని రాష్ట్ర బీసీ సంక్షేమం, పౌరసరఫరాల శాఖ మంత్రిగంగుల కమలాకర్ అన్నారు. శనివారం సాయంత్రం కలెక్టరేట్ సమావేశం మందిరంలో దళిత బంధు కాపీ టేబుల్ బుక్ ఆవిష్కరణ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సెప్టెంబర్ 14, 2021 పైలెట్ ప్రాజెక్టు హుజరాబాద్‌లో చేపట్టిన దళితబంధు పథకం విశ్వ వ్యాప్తంగా ప్రఖ్యాతిగాంచిందని ఇప్పటివరకు దళితులకు వంద శాతం సబ్సిడీ అందించిన దాఖలా గతంలో ఎన్నడు జరగలేదన్నారు. బాబాసాహెబ్ అంబేద్కర్ కన్న కలలు కెసిఆర్ నిజం చేస్తున్నారని బిఆర్ అంబేద్కర్ మనవడు ప్రకాష్ అంబెడ్కర్ సంతోషం వ్యక్తం చేశారని మంత్రి అన్నారు. దళిత బంధు కార్యక్రమం ద్వారా హుజరాబాద్ నియోజకవర్గంలో18వేల21 మంది లబ్ధిదారులకు లబ్ధి చేకూర్చేలా కృషి చేసిన జిల్లా కలెక్టర్ ఆర్ వి కర్ణన్ ను, క్షేత్రస్థాయిలో కష్టపడిన క్లస్టర్, నోడల్ అధికారులందరికి మంత్రి అభినందనలు తెలిపారు. దళిత బంధు పథకం విశిష్టతను ప్రపంచంలోని ప్రజలందరికీ తెలిసేలా కాఫీ టేబుల్ బుక్ ను మంత్రి ఆవిష్కరించారు. అనంతరం కేక్ కట్ చేసి పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో నగర మేయర్ వై సునీల్ రావు, జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ కనుమల్ల విజయ, ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ బండ శ్రీనివాస్, అదనపు కలెక్టర్లు గరిమ అగర్వాల్, జి వి శ్యాంప్రసాద్ లాల్, ట్రైనీ కలెక్టర్ లెనిన్ వాత్సల్ టోప్పో, నవీన్ నికోలస్, డిప్యూటీ మేయర్ చల్లా స్వరూప రాణి హరిశంకర్, ఎస్సీ కార్పొరేషన్ ప్రత్యేక అధికారి సురేష్, ఈడిఎస్‌సి కార్పొరేషన్ నాగార్జున, క్లస్టర్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.



## అంబేద్కర్ విగ్రహ ఆవిష్కరణ జీర్ణించుకోలేకపోతున్నారు

### బండి సంజయ్‌కు మతి భ్రమించింది - మంత్రి కొప్పుల



ధర్మపురి,ఏప్రిల్ 15 మనం న్యూస్ ః 125 అడుగుల అంబేద్కర్ విగ్రహం ఆవిష్కరణ జీర్ణించుకోలేకపోతున్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ ను రాజకీయంగా ఎదుర్కోలేక పిచ్చిపిచ్చి విమర్శలు చేస్తున్నారు. తెలంగాణ సచివాలయ భవనానికి అంబేద్కర్ పేరు పెట్టినందుకు విమర్శలు చేస్తున్నారా..పేపర్ లికేజి ఘటనలో పట్టపగలు పట్టుబడిన దొంగ బండిడ సంజయ్ దళితుల జనోద్ధార ణ కోసం అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్న ముఖ్యమంత్రి కేసీఆర్ ని విమర్శించే నైతిక అర్హత బండి సంజయ్ కు లేదు – మంత్రి కొప్పుల.బిజేపీ అధ్యక్షుడు బండి సంజయ్‌పై రాష్ట్ర ఎస్సీ అభివృద్ధి,మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్ ఫైర్ అయ్యారు.దేశంలోనే అత్యంత ఎత్తులో 125 అడుగుల భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్ అంబేద్కర్ విగ్రహం ఆవిష్కరించుకున్న సందర్భంగా బండి సంజయ్ చేసిన విమర్శలు అర్ధరహితమని,బండి సంజయ్‌కు మతి భ్రమించి మాట్లాడుతున్నారని మంత్రి ఎద్దేవా చేసారు. అంబేద్కర్ విగ్రహం ఆవిష్కరణ జీర్ణించుకోలేకపోతున్నారని,ముఖ్యమంత్రి కేసీఆర్ ను రాజకీయంగా ఎదుర్కోలేక పిచ్చిపిచ్చి ప్రేలాపనలు చేస్తున్నారని,పేపర్ లికేజి ఘటనలో పట్టపగలు పట్టు బడిన దొంగ సంజయ్,దళితుల జనోద్ధారణ కోసం అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్న ముఖ్యమంత్రి కేసీఆర్ ని విమర్శించే నైతిక అర్హత బండి సంజయ్ కు లేదన్నారు. తెలంగాణ సచివాలయం భవనానికి అంబేద్కర్ పేరు పెట్టినందుకు విమర్శలు చేస్తున్నారా .. లేక నూతన పార్లమెంట్ భవనానికి అంబేద్కర్ పేరు పెట్టాలని డిమాండ్ చేస్తున్నందుకు విమర్శిస్తున్నారా బండి సంజయ్ సమాధానం చెప్పాలన్నారు. ఇప్పటికైనా కేసీఆర్ పై తెలంగాణ సర్కార్‌పై చేసిన విమర్శలకు బండి సంజయ్ క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. బండి సంజయ్ నోరు అదుపులో పెట్టుకొని మాట్లాడాలన్నారు. లేనట్లయితే ప్రజలే తగిన రీతిలో సమాధానం చెబుతారని మంత్రి కొప్పుల హెచ్చరించారు.

## జర్నలిస్టుల ఇండ్ల స్థలాల కోసం 17న టిడబ్ల్యూజేఎఫ్ ఆధ్వర్యంలో సంతకాల సేకరణ



కరీంనగర్, ఏప్రిల్ 15 (మనం న్యూస్)ః తెలంగాణ వర్కింగ్ జర్నలిస్టుల ఫెడరేషన్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఈ నెల 17వ తేదీన జిల్లావ్యాప్తంగా అన్ని మండల, నియోజకవర్గ, జిల్లా కేంద్రాల్లో జర్నలిస్టల సంతకాల సేకరణ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఫెడరేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కొమ్మెర తిరుపతి రెడ్డి తెలిపారు. సంతకాల సేకరణ సన్నాహక సమావేశాన్ని శనివారం కరీంనగర్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా తిరుపతిరెడ్డి మాట్లాడుతూ జర్నలిస్టుల సమస్యలను పరిష్కరించే విషయంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తి నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందన్నారు. అర్హులైన జర్నలిస్టులందరికీ రాష్ట్ర వ్యాప్తంగా ఇళ్ళ స్థలాలను కేటాయిస్తామని ప్రకటిస్తూ నాన్చివేత ధోరణిని అవలంభిస్తోందని విమర్శించారు. జర్నలిస్టుల నివేశనా స్థలాల కేటాయింపు విషయాన్ని తెలంగాణ వర్కింగ్ జర్నలిస్టుల ఫెడరేషన్ తరపున మరోసారి రాష్ట్ర ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లే ప్రయత్నంలో భాగంగా 17వ తేదీన జర్నలిస్టుల సంతకాల సేకరణ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. జిల్లాలో జర్నలిస్టులందరూ ఈ కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో తెలంగాణ వర్కింగ్ జర్నలిస్టుల ఫెడరేషన్ జిల్లా ఉపాధ్యక్షులు నల్లగొండ సత్తయ్య, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గాదె కరుణాకర్‌రావు, జిల్లా జాయింట్ సెక్రటరీ నరేష్, సభ్యులు రాంప్రసాద్, సంపత్, వినోద్, శంకర్, తదితరులు పాల్గొన్నారు.

# మోడు బారుతున్న... ఔషధ మాను...

## - ఆరోగ్య వరప్రదాయిని వేప.. అనారోగ్యం బారిన పడింది..

## - సస్యరక్షణ చర్యలు చేపట్టకపోతే ప్రశ్నార్థకం కానున్న వేప మనుగడ

జమ్మికుంట, ఏప్రిల్ 15 (మనం న్యూస్): ఎన్నో రుగ్మతలను కనుమరుగు చేసే ఔషధాలయంగా పేరున్న వేప చెట్టు ప్రమాదకర పరిస్థితుల్లో జీవనం సాగిస్తోంది. నిన్న మొన్నటి వరకు పచ్చగా ఉన్న వేప వృక్షాలు ప్రస్తుతం అన్ని ప్రాంతాల్లో ఎండిపోయి నిర్జీవంగా కనిపిస్తున్నాయి. ఎన్నో ఏళ్లుగా చల్లని నీడనిస్తూ ప్రజల సేద దీర్చడమే కాకుండా ఆరోగ్య పరిరక్షణకు ఉపకరించిన వేప చెట్లు ఆనారోగ్యం బారిన పడి ఉనికి కోల్పోయే ప్రమాదంలో పడ్డాయి. అసలు వేప చెట్లకు ఏమైంది..? ఆనాది కాలంగా ఆరోగ్యాన్నందించే విషయంలో అమ్మలా ఆదుకున్న వేప సంతతి అనారోగ్యం బారిన పడడానికి కారణమేమిటి..? మానవాళికి కరోనా వైరస్ సోకినట్లు, వేప చెట్లకు కూడా ఏదైనా వైరస్ సోకిందా...? అనే అనుమానాలు అనేక మంది మెదళ్లను తొలిచివేస్తున్నాయి.. ఈ నేపథ్యంలో వేప చెట్టు విశిష్టత, ఆ వృక్షాల దుస్థితికి కారణాలపై 'మనం' ప్రత్యేక కథనం...

ఎన్నో ఔషధ గుణాలున్న చెట్టుగా పేరుగాంచిన శక్తివంతమైన వృక్షం వేప వృక్షం. ఆయుర్వేదంలో వేప చెట్టును సహజ ఔషధాలయంగా పరిగణిస్తారు. ఇది ఎక్కువగా భరత ఖండంలో పెరుగుతుంది కానీ దీని ఉపయోగాన్ని గుర్తించడం మొదలుపెట్టి ఇదే తరహా వాతావరణం ఉన్న ప్రదేశాల్లో ప్రపంచవ్యాప్తంగా ఇప్పుడు పెంచుతున్నారు. వేప చెట్టు మీలియేసి కుటుంబానికి చెందినది. వేప యాంటి ఇన్ఫ్లమేటరీ, యాంటీ ఫంగల్, యాంటీ ఏజింగ్ గుణాలను కలిగి ఉండే కల్పవృక్షం. ఇది క్యాన్సర్ ను దూరంగా ఉంచడంతో పాటు యోగసాధనలో కూడా ఉపయోగపడుతుంది.

ప్రాచీన ఆయుర్వేద శాస్త్రం ప్రకారం వేప అనేది అన్ని ఔషధాలలోకీ రారాజు. ప్రాచీనకాలం నాటి ఆయుర్వేద గ్రంథాల్లో వేప చెట్టు చర్మ రుగ్మతలను, జుట్టు సమస్యలను ఎలా పోగొడుతుందో, ఆకలిని పెంచి జీర్ణక్రియను ఎలా మెరుగుపరుస్తుందో, కడుపులోని జఠరాగ్నిని ఎలా పెంచుతుందో, శ్వాసను ఎలా మెరుగుపరుస్తుందో, మధుమేహ పరిస్థితులను నిర్వహించడానికి ఎలా సహాయపడుతుందో, గాయాలను నయం చేయడానికి ఎలా ఉపకరిస్తుందో,





వికారం నుండి ఏ విధంగా ఉపశమనాన్నిస్తుందో పేర్కొనబడి ఉంది. వేపను '21వ శతాబ్దపు చెట్టు' గా ఐక్యరాజ్యసమితి ప్రకటించింది. యుఎస్ నేషనల్ అకాడమీ ఆఫ్ సైన్స్ కూడా 1992లో తన నివేదికలో వేప: ప్రపంచ సమస్యలను పరిష్కరించడానికి ఒక చెట్టు అనే పేరుతో వేప ఔషధ విలువను గుర్తించింది. వేప అనేది 4000 సంవత్సరాలకు పైగా భారతదేశంలో వాడబడుతున్న ఒక ఔషధ మూలిక. వేప చెట్టు యొక్క అన్ని భాగాలు వివిధ రకాలుగా ప్రయోజనకరంగా ఉంటాయి. వాస్తవానికి, వేప కూడా అరిష్ట అనగా 'అనారోగ్యం యొక్క ఉపశమనం' అనే సంస్కృత పేరుతో పిలువబడుతుంది. వేప చెట్టు సాధారణంగా నిండుగా ఆకులను కలిగి ఉంటుంది మరియు 75 అడుగుల ఎత్తు వరకు పెరుగుతుంది ప్రస్తుతం దక్షిణ రాష్ట్రాలలో ఆకులు, కొమ్మలు, పూత చెట్టుకు చెట్టె ఎండిపోవడం జరుగుతుంది..

### : వేప చెట్టుకి డై బ్యాక్ డిసీజ్ :

హేలోపెల్టిస్ అంటోని అనే టీ మస్కిటో బగ్ ఎక్కువగా టీ తోటలను నాశనం చేసేది. అయితే ఈ దోమ ద్వార ఫామోప్సిస్ అజాడిరెక్ట అనే శిలింద్రం ఒక చెట్టు నుండి ఇంకో చెట్టుకి ఎక్కువగా వ్యాప్తి చెందుతుంది. దీని ద్వారా డై బాక్ వ్యాధి ఎక్కువగా వ్యాపిస్తుంది. మొదటగా ఇండియా లో డెహ్రాడున్‌లో దీన్ని గుర్తించడం జరిగింది. ముఖ్యంగా ఈ డై బ్యాక్ తెగులు అనేది ఇది వర్షాకాలం సమయంలో కనబడుతుంది. దీని ఉధృతి ఆగస్టు నుండి అక్టోబర్, నవంబర్ లో బాగా ఎక్కువ అవుతుంది. ఎండలు ప్రారంభం అయ్యాక తగ్గే అవకాశం ఉంది. ఆ తర్వాత మొక్క స్వయం రోగ నిరోధక శక్తి ద్వారా మళ్ళీ ఆరోగ్యంగా తయారయ్యే గుణాన్ని కలిగి ఉంటాయి. ఒకవేళ ఎక్కడ ఐనా మొక్కలు ఇంకా కోలుకోకా పోతే ఒకసారి మొక్క మొదలు దగ్గర కార్బన్‌డజిమ్ + మాకోజెబ్ అనే మందును 3గ్రా /లీటర్ నీటికీ కలిపి 15 రోజుల వ్యవదిలో రెండు సార్లు వేర్లు తడిచేలా పోయాలి.

**దీని వ్యాప్తి :** విత్తనం లోని పిండం,పై పొరలో కూడా దీని సంతతి ఉండి వ్యాప్తికి కారణమవుతుంది.అలాగే ఒక చెట్టు నుంచి ఇంకో చెట్టుకు ఇది గాలి ద్వారా వ్యాపిస్తుంది. శిలీంధ్ర రేణువులు గాలి ద్వారా వ్యాపిస్తాయి. అలాగే ఒక చెట్టుపై వాలిన కీటకాలు మరో చెట్టుపై వాలినా వస్తుంది. వర్షపు నీరు ఒక చెట్టు నుంచి జారి మరో చెట్టపై పడినప్పుడు కూడా వస్తుంది. చెట్టు పెద్దదా చిన్నదా, వయసు ఎంత అనే దాంతో నిమిత్తం లేకుండా వ్యాపిస్తుంది.

### టీ మస్కిటో బగ్(హేలోపెల్టిస్ అంటోని):

టీ మస్కిటో బగ్ ఎరుపు పచ్చ రంగులో ఉంటుంది. 8మిల్లీ మీటర్ల పొడుగు ఉంటుంది. మగ పురుగులు 9-10 రోజులు ఆడ పురుగులు 7-8 రోజులు



జీవిత కాలం ఉంటాయి. మగ వాటికంటే ఆడ పురుగు కొంచం పెద్దగా ఉంటుంది. ఆడ దోమ 60-70 గుడ్లను పెడుతుంది 6-12 రోజుల్లో గుడ్డు పొదుగ పడుతుంది. దీని నివారణకు లాండ సహ్యాలోత్రిన్ 5 ఉఛి ని 0.6 మీ.లీ లను ఒక లీ నీటిలో కలిపి పిచికారి చేయాలి లేదా ప్రొఫెనో ఫాస్ అనే మందు ని 2 మీ.లీ ఒక లీ నీటిలో కలిపి పిచికారి చేయాలి. ఈ హేలోపెల్టిస్ అంటోని మస్కిటో బగ్ ని నివారించడానికి జాతీయ ఉద్యాన పరిశోదన సంస్థ(ఐఐఏఖ ), బెంగళూరు వారు రూపొందించిన బవేరియ బాసియనను వారాని కోసారి పిచికారి చేయడం ద్వారా ఈ పురుగు ఉధృతిని తగ్గించవచ్చు.

### గుర్తుంచుకోవాల్సిన కొన్ని విషయాలు:

నర్సరీలలో విత్తే సమయం లో విత్తన శుద్ధి ని కార్బండిజం శిలీంధ్ర నాశకం ద్వార చేయడం ద్వార తెగుళ్ళు చాల వరకు అరికట్టే అవకాశం ఉంది. ఎండిన కొమ్మలను ఎప్పటికప్పుడు ప్రూనింగ్ చేసి తగలబెట్టాలి. వ్యాధి బారిన పడ్డ చెట్లకు వీలైనన్ని నీళ్లు ఇవ్వాలి. ఎక్కువ నీరు పెడితే తొందరగా కోలుకుంటుంది. చెట్టు ఎండిపోయింది అని కొట్టేయకూడదు. ఈ చెట్లకు పురుగు మందులు పిచికారీ చేసే క్రమంలో తగు జాగ్రత్తలు తీసుకోవాలి లేకుంటే ఆ మందు ఇతర చెట్లు, జీవులపై పడి సీతాకోకచిలుకల వంటి కీటకాలు చనిపోయే ప్రమాదం ఉంది.

### ఎండిపోతున్న వేప చెట్లు...

గుడిపల్లి వేణుగోపాల్, ఉద్యానవన శాస్త్రవేత్త, జమ్మికుట విజ్ఞాన కేంద్రం

ఫోమాప్సిస్ అనే శిలీంద్రాల వల్ల మన తెలంగాణ,ఆంధ్ర, కర్ణాటక రాష్ట్రాలలో వేపకి ముప్పు మొదలయ్యింది. కొన్ని సంవత్సరాల నుండి దీని బెడద ఉన్నప్పటికీ గత సంవత్సరం నుండి ఇది ఎక్కువగా గమనిస్తూ వస్తున్నాం.కాండం తొలిచె పురుగు చెట్లని ఎక్కువ నాశనం చేస్తుంది ఈ పురగు ఉనికి ఎక్కువ ఉన్న చెట్లల్లో ఈ శిలీంద్రాల ఉధృతి ఎక్కువ ఉంటుంది ఈ ఎండు తెగులునీ కలిగించే శిలీంద్రం మరియు కొన్ని వేప చెట్ల పై పెరిగే లోరంతస్, కస్కుట లాంటి రసం పీల్చే పరాన్న జీవ మొక్కల వల్ల కూడా వేప చెట్ల లో నీరు తగ్గి ఎండు తెగులు కి కారణ మవుతుంది.నివారణకు హెక్స కొనజోల్ లాంటి శిలింద్ర నాశకాలనీ వాడవచ్చు. కంపోస్టు ఎరువు వేసి మంచి శిలీంద్రాలు,బాక్టీరియా ను పెంపొందించి ఆ తెగులు చంపేస్తుంది.

---

# సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలి

## ఎస్పీ అఖిల్ మహాజన్



రాజన్న సిరిసిల్ల, ఎప్రిల్ 15 (మనం న్యూస్): సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, సోషల్ మీడియాలో వచ్చే ప్రకటనలు చూసి మోసపోవద్దని జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ అన్నారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడు తూ ఆధునిక సాంకేతిక కాలంలో అందుబాటులోకి వస్తున్న కొత్త సాంకేతిక పరిజ్ఞానం, పరికరాల వల్ల సైబర్ నేరాల శాతం పెరుగుతోందన్నారు. వివిధ రకాల అవసరాలకు అనుగుణంగా సాంకేతిక పరికరాలు ఉపయోగించక తప్పదని, కానీ అదే సమయంలో ప్రజలు సైబర్ నేరాల గురించి అవగాహన కలిగి వుండాలని పేర్కొన్నారు. ఆశ, భయం అనే రెండు అంశాల మీద సైబర్ నేరస్తులు నేరాలకు పాల్పడుతున్నారన్నారు. నకిలీ లాటరీలు, నకిలీ ఉద్యోగ ప్రకటనలు, నకిలీ బ్యాంకు అకౌంట్ సమాచారం, నకిలీ గిఫ్ట్ బాక్సులు, లోన్ యాప్ మొదలగు వంటి వాటి పేర్లతో సైబర్ నేరగాళ్లు ప్రజలను మోసం చేస్తున్నారన్నారు. వ్యక్తిగత సమాచారాన్ని ఎప్పుడు సామాజిక మాధ్యమాలలో పంచుకోకూడదన్నారని, సైబర్ నేరగాళ్లు ఇలాంటి అవకాశాల కోసం వేచి చూస్తారన్నారు. కావున ఫోన్లు వాడేటప్పుడు జాగ్రత్తగా ఉండాలని, ఏదైనా సైబర్ క్రైమ్ జరిగిన వెంటనే 1930కి కాల్ చేయాలని ఎస్పీ సూచించారు.

# ఊటూరులో బిజెపి బూత్ స్వశక్తికరణ్ అభియాన్

మానకొండూరు, ఏప్రిల్ 15 (మనం న్యూస్): కరీంనగర్ జిల్లా మానకొండూర్ మండలం ఉటూర్ గ్రామంలో బిజెపి శక్తికేంద్ర ఇంచార్జి పోచంపల్లి శ్రీనివాస్ ఆధ్వర్యంలో శనివారం బూత్ స్వశక్తికరణ్ అభియాన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సంద ర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన బిజెపి మండల అధ్యక్షులు రాపాక ప్రవీణ్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ పథకాలను ఇంటింటికి ప్రచారం చేస్తూ ప్రజలను చైతన్యవంతులను చేయాలని పిలుపుని చ్చారు. కార్యకర్తలు ఎన్నికలకు సిద్ధంగా ఉండాలని, ఎన్నికలు ఎప్పుడు వచ్చినా ఎదుర్కోవాలన్నారు. ఈ కార్యక్రమంలో 72వ పోలింగ్ బూత్ అధ్యక్షులు మచ్చా రవీందర్, 73వ పోలింగ్ బూత్ అధ్యక్షులు తోకల శ్రీనివాసరెడ్డి, 74వ పోలింగ్ బూత్ అధ్యక్షులు గంగాదేవి శ్రీనివాస్, 76వ పోలింగ్ బూత్ అధ్యక్షులు మద్దెల నరేష్, నాయకులు కిషోర్, కనుకుంట్ల ఆంజనేయులు, కనుకుంట్ల సురేష్, సింగారపు రాకేష్, తిరుపతి, సిరిశెట్టి వీరయ్య, శివనాద్, అజయ్ తదితరులు పాల్గొన్నారు.



# చట్టాలపై అందరికి అవగాహన ఉండాలి

## న్యాయసేవాధికార సంస్థ జడ్జి సుజయ్

కొత్తపల్లి, ఏప్రిల్ 15 (మనం న్యూస్)ః సమాజంలోని ప్రతి ఒక్కరూ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని న్యాయసేవాధికార సంస్థ సీనియర్ సివిల్ జడ్జి బి.సుజయ్‌కుమార్ తెలిపారు. శనివారం కొత్తపల్లిలోని ఢిల్లీ డిఫెన్స్ అకాడమీ జూనియర్ కళాశాలలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ పౌరులకు హక్కులతో పాటు బాధ్యతలు కూడా ఉంటాయని, అందరు జాగ్రత్తగా ఉండాలని సూచించారు. సమాజంలోని యువత మంచి లక్ష్యం ఏర్పాటు చేసుకొని ముందుకు వెళ్లాలని, చెడు అలవాట్లకు, సోషల్ మీడియాకు దూరంగా ఉండాలన్నారు. ఆపద సమయాల్లో ఉచిత న్యాయ సేవా అధికారాన్ని, పిల్లలకి ఏదైన ఆపద ఉంటే బాలల సంరక్షణ కోసం 24 గంటలు అందుబాటులో ఉండే చైల్డ్ హెల్ప్ లైన్ 1098 నంబర్ కు ఫోన్ చేయాలని సుజయ్ సూచించారు. ఈ కార్యక్రమంలో చైల్డ్ హెల్ప్ లైన్-1098 జిల్లా కో-ఆర్డినేటర్ ఆవుల సంపత్ యాదవ్, న్యాయవాదులు ఏ.శ్రీనివాస్, టి.మహేష్, టీమ్ మెంబెర్ నరేంద్ర, కళాశాల చైర్మన్ సతీష్ రెడ్డి, ప్రిన్సిపాల్ చంద్ర శేఖర్ తదితరులు పాల్గొన్నారు.



## సిఐని కలిసిన ప్రభాకర్



జమ్మికుంట, ఏప్రిల్ 15 (మనం న్యూస్)ః జమ్మికుంట నూతన సిఐగా బాధ్యతలు స్వీకరించిన బర్పాటి రమేష్‌ను నంది అవార్డు గ్రహీత అంబాల ప్రభాకర్ శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనను శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో భారత రాష్ట్ర సమితి యువజన విభాగం హుజురాబాద్ నియోజకవర్గ నాయకులు అంబాల రాజు, మహేంద్ర మేదర సంఘం కరీంనగర్ జిల్లా అధ్యక్షులు మధిర రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

## దళితరత్న బొల్లి స్వామిని సన్మానించిన వాకర్స్ క్లబ్ సభ్యులు




ధర్మారం, ఏప్రిల్ 15 (మనం న్యూస్)ః అంబేద్కర్ జయంతి ఉత్సవాల సందర్భంగా దళిత రత్న అవార్డును అందుకున్న పెద్దపల్లి జిల్లా ధర్మారంకు చెందిన బొల్లి స్వామిని స్థానిక సుందరయ్య పార్క్ వాకర్స్ క్లబ్ సభ్యులు శనివారం ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో వాకర్స్ క్లబ్ ప్రెసిడెంట్ సలిపెల రమేష్‌రెడ్డి, పార్క్ మాజీ ప్రెసిడెంట్ అంబటి శ్రీనివాస్ రెడ్డి, వైస్ ప్రెసిడెంట్ రాపర్తి సంతోష్ గౌడ్, సీనియర్ వర్కర్స్ తమిళ్ రాజు, బంగ్లా రాజు, పెయింటర్ కృష్ణ, స్కైలాబ్ బాబు, రాజ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## అద్దె చెల్లించడం లేదని... ఎంపిడివో కార్యాలయానికి తాళం వేసిన ఇంటి యజమాని



ఇల్లందకుంట, ఏప్రిల్ 15 (మనం న్యూస్)ః కరీంనగర్ జిల్లా ఇల్లందకుంట ఎంపిడివో కార్యాలయ భవన అద్దె గత కొంత కాలంగా చెల్లించకపోవడంతో ఆ ఇంటి యజమాని కార్యాలయానికి తాళం వేసిన ఘటన శనివారం చోటుచేసుకుంది. గత 16 నెలలుగా కార్యాలయ భవనానికి చెందిన అద్దె లక్షా 45వేల 600 రూపాయలు చెల్లించకపోవడంతో, సదరు భవన యజమాని చింతిరెడ్డి మల్లారెడ్డి పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేకుండా పోయింది. కార్యాలయ భవన అద్దెతో పాటు 21వేల రూపాయల విద్యుత్ బిల్లులను సైతం చెల్లించ కపోవడంతో ఇంటి యజమాని కార్యాలయం గేటుకు తాళం వేశారు. దీంతో ఎంపిఓ వెంకటేశ్వర్లు అక్కడకు చేరుకుని ప్రజా ప్రతినిధులు, ఉన్నతాధికారులతో మాట్లాడి సోమవారం వరకు పూర్తి బకాయిలు చెల్లిస్తామని హామీనివ్వడంతో మల్లారెడ్డి తాళం తీశారు.

## రోహిత్‌రావు ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందు




కరీంనగర్ కలెక్టరేట్, ఏప్రిల్ 15 (మనం న్యూస్)ః రంజాన్ పవిత్ర మాసం సందర్భంగా ముస్లిం సోదరులకు కరీంనగర్ నియోజకవర్గ నాయకులు మేనేని రోహిత్ రావు ఆధ్వర్యంలో నగరంలోని ముస్లిం షాదిఖానాలో శనివారం ఇఫ్తార్ విందును ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా మాజీ పార్లమెంట్ సభ్యులు పొన్నం ప్రభాకర్ పాల్గొన్నారు. అనంతరం రోహిత్ రావు మాట్లాడుతూ ఇఫ్తార్ విందులు మత సామరస్యానికి ప్రతీకగా నిలుస్తాయని, గంగా జమున తెహజీబ్ కు ప్రతిరూపంగా మారుతాయన్నారు. రంజాన్ పండుగ మత సామరస్యానికి ప్రతీకాగా నిలిచిందని, ఉపవాస దీక్షలు పాటించే ముస్లిం సోదరులకు ఖర్జుర పండ్లు, డ్రైఫ్రూట్స్ తినిపించి రోజాను విరమింపజేశారు. ఈకార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు కవ్వంపల్లి సత్యనారాయణ, వర్కింగ్ ప్రెసిడెంట్ పద్మాకర్ రెడ్డి, టి పి సి సి కార్యదర్శి రహమత్ హుస్సేన్, వైద్యుల అంజన్ కుమార్, సమద్ నవాబ్, మైనర్ విశాల్ జిల్లా అధ్యక్షులు తాజుద్దీన్ యూత్ కాంగ్రెస్ అసెంబ్లీ అధ్యక్షులు అబ్దుల్ రెహమాన్, కలీం, మైనార్టీ సెల్ నగర అధ్యక్షులు అఖిల్, మోసిన్, ఇర్ఫాన్, ఇమ్రాన్, సామాజిక కార్యకర్త మొహమ్మద్ అమీర్, అజీజ్ హుస్సేన్, సాదిక్, వాజిద్, సయ్యద్ సమీర్, అష్రాఫ్, హైమద్, అక్బర్, లైక్, నేహాల్, కమురుద్దీన్, కిసాన్ సెల్ కొత్తపల్లి మండల అధ్యక్షులు సిరిపురం నాగప్రసాద్, దుర్షెడ్ గ్రామ శాఖ అధ్యక్షులు బుర్ర హరీష్ గౌడ్, బొమ్మకల్ గ్రామ ఎస్సీ సెల్ అధ్యక్షులు ఆరెపల్లి శ్రీకాంత్, పిట్టల సాయి,శివ ప్రసాద్,మాట్ల వంశీ,తాడూరి అజయ్, కొత్తకొండ సాయి గణేష్, రాజ్ కోటి పాల్గొన్నారు.

## డిఎంహెచ్‌వోగా బాధ్యతలు స్వీకరించిన లలితాదేవి



కరీంనగర్ బ్యూరో, ఏప్రిల్ 15 (మనం న్యూస్)ః జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిగా డాక్టర్ లలితా దేవి శనివారం బాధ్యతలు చేపట్టారు. ఆమె ఇంతకు ముందు హనుమకొండ జిల్లా ట్రైనింగ్ టీం ప్రోగ్రాం ఆఫీసర్ గా బాధ్యతలు నిర్వహించారు. ఈ సందర్భంగా లలితా దేవి మాట్లాడుతూ జిల్లాలోని ఆరోగ్య సిబ్బంది సమిష్టిగా పనిచేసి జిల్లా ప్రజలకు అన్ని ఆరోగ్య సేవలు అందిస్తూ, జిల్లాను రాష్ట్రంలో ప్రథమ స్థానంలో ఉండే విధంగా కృషి చేయాలన్నారు.

## సంస్కృతి, సంప్రదాయాల విలువలు పిల్లలకు తెలియపర్చాలి

### మున్సిపల్ చైర్ పర్సన్ కళ



రాజన్న సిరిసిల్ల, ఏప్రిల్ 15 (మనం న్యూస్): దేశ సంస్కృతి, సంప్రదాయాల విలువలను పిల్లలకు తెలియపరచాల్సి అవసరముందని సిరిసిల్ల మున్సిపల్ చైర్ పర్సన్ జిందం కళా చక్రపాణి అన్నారు. సిరిసిల్ల పట్టణంలోని వికాస్ డిగ్రీ, పీజీ కళాశాల ఆధ్వర్యంలో శనివారం సంస్కృతి, సాంప్రదాయాల దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన కళ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా చైర్ పర్సన్ జిందం కళ మాట్లాడుతూ భవిష్యత్‌లో దేశ పురోగతి పాటుపడే విధంగా నేటి యువతను తీర్చిదిద్దాల్సిన బాధ్యత తల్లిదండ్రులతో పాటు విద్యాలయాలపైన ఉందన్నారు. మన సంస్కృతి సంప్రదాయాల ఆచార వ్యవహారాల గొప్పతనం తెలియజేసెలా చక్కటి కార్యక్రమాన్ని నిర్వహించిన వికాస్ డిగ్రీ, పీజీ కళాశాల యాజమాన్యాన్ని అభినందించారు. నేటి ఆధునిక మానవ జీవితంలో బాల్యం స్థాయి నుండి మన ఆచార వ్యవహార సాంప్రదాయ పౌష్టిక ఆహార వంటల యొక్క గొప్పతనం పిల్లలకు తెలియాల్సిన అవసరం ఎంతో ఉందని కళ అన్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ సభ్యులు దార్నం అరుణ లక్ష్మీనారాయణ, గడ్డం లత భాస్కర్, దిడ్డి మాధవి రాజు, బిఆర్ఎస్ పార్టీ పట్టణ మహిళా అధ్యక్షురాలు బత్తుల వనజ రమేష్, వికాస్ డిగ్రీ, పీజీ కళాశాల ప్రిన్సిపాల్ దిడ్డి శ్రీనివాస్, లెక్చరర్లు, కళాశాల సిబ్బంది, విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

## గాయత్రి బ్యాంకు ఖాతాదారుని కుటుంబానికి బీమా చెక్కు పంపిణీ



జమ్మికుంట, ఏప్రిల్ 15 (మనం న్యూస్)ః కరీంనగర్ జిల్లా జమ్మికుంట గాయత్రి కో-ఆపరేటివ్ అర్బన్ బ్యాంకు ఖాతాదారుడు వంతాటి శ్రీనివాస్ ప్రమాదవశాత్తు మృతి చెందగా అతని కుటుంబ సభ్యులకు లక్ష రూపాయల విలువ చేసే ప్రమాద బీమా చెక్కును అందించారు. శనివారం బ్యాంకు ఆవరణలో జరిగిన కార్యక్రమంలో జమ్మికుంట మున్సిపల్ కమిషనర్ బిర్రు శ్రీనివాస్, బ్రాంచి మేనేజర్ ఒడ్డుల మహేందర్‌లు మృతుని భార్య పంతాటి అరుణకు చెక్కును పంపిణీ చేశారు.

## టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన గెల్లు



జమ్మికుంట, ఏప్రిల్ 15 (మనం న్యూస్)ః రాష్ట్ర టూరిజం డెవలప్ మెంట్ కార్పొరేషన్ చైర్మన్ గా హుజురాబాద్ నియోజకవర్గ బిఆర్ఎస్ ఇంచార్జి గెల్లు శ్రీనివాస్ యాదవ్ హైదరాబాద్‌లోని జలవిహార్ లో శనివారం మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ముఖ్య నేతల సమక్షంలో పదవి బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ యాదవ్‌ను జమ్మికుంట ప్రజా ప్రతినిధులు, నాయకులు కలిసి శుభాకాంక్షలు తెలిపి, ఘనంగా సన్మానించారు. విద్యార్థి ఉద్యమ నేతకు మరోకసారి గౌరవం కల్పించిన ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్ రావుకి ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ కష్టపడ్డ ప్రతి కార్యకర్తకు బిఆర్ఎస్ పార్టీలో మంచి భవిష్యత్ ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో జమ్మికుంట మున్సిపల్ చైర్మన్ తక్కళ్ళపల్లి రాజేశ్వర్ రావు, వైస్ చైర్ పర్సన్ దేశిని స్వప్నకోటి, ఎంపిపి దొడ్డే మమత ప్రసాద్, జడ్పిటిసి సభ్యులు డాక్టర్ శ్రీరామ్ శ్యామ్, పిఎసిఎస్ చైర్మన్ పొనగంటి సంపత్, బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు పొనగంటి మల్లయ్య, కౌన్సిలర్లు శ్రీపతి నరేష్, బొంగోని వీరన్న, దేశిని రాధా సదానందం, ఎలగందుల సరూప శ్రీహరి, పాతకాల రమేష్, పొనగంటి రామ్మూర్తి, పొనగంటి సారంగం, వైస్ ఎంపీపీ తిరుపతి రావు, రైతు సమన్వయ సమితి జిల్లా మెంబర్ కనపర్తి లింగారావు, జమ్మికుంట మండల సర్పంచ్ లు, ఎంపిటిసి సభ్యులు, బిఆర్ఎస్ నాయకులు మైస మహేందర్, ఓరుగంటి శ్యామ్‌రావు, బండి రవి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## సిపిఐ ప్రజాచైతన్య యాత్ర పోస్టర్ ఆవిష్కరణ



కరీంనగర్ కలెక్టరేట్, ఏప్రిల్ 15 (మనం న్యూస్)ః పల్లె పల్లెకు సిపిఐ ప్రజల వద్దకు సిపిఐ కార్యక్రమంలో భాగంగా నిర్వహిస్తోన్న ప్రజా చైతన్య యాత్ర వాల్ పోస్టర్‌ను సిపిఐ జిల్లా కార్యదర్శి మర్రి వెంకటస్వామి ఆవిష్కరించారు. శనివారం స్థానిక బద్దం ఎల్లారెడ్డి భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కార్యక్రమ రూట్ మ్యాపును విడుదల చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఈ నెల 16 న కరీంనగర్ లో ప్రారంభం కానున్న పాదయాత్ర మానకొం డూర్, శంకరపట్నం, వీణవంక, జమ్మికుంట కు చేరుకోనుందని తెలి పారు. అనంతరం కరీంనగర్, సిద్దిపేట, రాజన్న సిరిసిల్ల, జగిత్యాల, పెద్దపల్లి జిల్లాలోని 80 మండలాలకు పైగా 12 రోజులపాటు యాత్ర కొనసాగనుందని, ఈ యాత్రకు సిపిఐ జాతీయ నేత చాడ వెంకటరెడ్డి తో పాటు 5 జిల్లాల సీపీఐ కార్యదర్శులు మర్రి వెంకటస్వామి, మంద పవన్, గుంటి వేణు, వెన్న సురేష్, తాండ్ర సదానందం నాయకత్వం వహిస్తారని తెలిపారు. ఈ నెల 16న కరీంనగర్ లోని కోర్టు చౌరస్తా వద్దనున్న అంబేడ్కర్ విగ్రహం నుంచి ప్రారంభించనున్న యాత్ర కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పార్టీ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు, జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకటరెడ్డిలు హాజరుకానున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి పార్టీ శ్రేణులు, ప్రజలు పెద్ద ఎత్తున తరలి వచ్చి జయప్రదం చేయాలని వెంకటస్వామి పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు బోయిని అశోక్, కసిరెడ్డి సురేందర్ రెడ్డి, టేకుమల్ల సమ్మయ్య, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు కసిరెడ్డి మణికంఠ రెడ్డి, జిల్లా కౌన్సిల్ సభ్యులు కటికరెడ్డి బుచ్చన్న యాదవ్, పైడిపెల్లి రాజు, నాయకులు బోనగిరి మహేందర్, మచ్చ రమేష్, కూన రవి, బూడిద కుమార్ తదితరులు పాల్గొన్నారు.

### గోదావరి నదిపై ఫెన్సింగ్ ఏర్పాటు చేసి..

# ఆత్మహత్యలు నివారించాలి

### సామాజిక కార్యకర్త దినేష్



గోదావరిఖని, ఏప్రిల్ 15 (మనం న్యూస్)ః గోదావరిఖని పారిశ్రామిక ప్రాంతంలోని గోదావరి బ్రిడ్జి ఆహ్లాదకరమైన వాతావరణం ఉన్నప్పటికీ నేడు ఆత్మహత్యలకు నిలయంగా మారడం దురదృష్టకరమని సామాజిక కార్యకర్త మద్దెల దినేష్ వ్యాఖ్యానించారు. గోదావరి బ్రిడ్జిపై ఫెన్సింగ్ ఏర్పాటు చేసి ప్రజల ప్రాణాలు కాపాడాలని సామాజిక కార్యకర్తలు శనివారం ఒకరోజు నిరసన దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గోదావరి నది చూడడానికి ఎంతో అందంగా, ఆహ్లాదంగా ఉన్నప్పటికీ కొంతమంది ప్రజలు క్షణికావేశంతో ఉద్యోగ ఉపాధి అవకాశాలు దొరక్క, అప్పుల బాధలతో, ఇంట్లో సమస్యలతో గోదావరి బ్రిడ్జి పైకి వచ్చి నదిలోకి దూకి ఆత్మహత్యలు చేసుకుంటున్నారన్నారు. ఇప్పటికీ వందలాది మంది ఈ ప్రాంతంలో ఆత్మహత్యల చేసుకోవడం దురదృష్టకరమని దినేష్ ఆవేదన వ్యక్తం చేశారు. గోదావరి నదిపై పెన్సింగ్ ఏర్పాటు చేయాలని గత కొన్నేళ్లుగా ఆందోళనలు, నిరసనలు తెలియజేసినప్పటికీ నగరపాలక సంస్థ స్పందించడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ పారిశ్రామిక ప్రాంతంలో ఎన్టిపిసి, ఆర్ఎఫ్‌సిఎల్, కేశోరాం, సింగరేణి, రామగుండం నగరపాలక సంస్థలు ఉన్నప్పటికీ ఏ ఒక్క పరిశ్రమ యాజమాన్యం కూడా ఫెన్సింగ్ ఏర్పాటుకు స్పందించకపోవడం దురదృష్టకరమన్నారు. వారానికి నలుగురు, ఐదుగురు ఆత్మహత్య ప్రయత్నం చేస్తున్నా పాలకులకు సోయి లేదా అని ప్రశ్నించారు. ఇప్పటికైనా స్థానిక శాసనసభ్యులు ప్రజా శ్రేయస్సు కొరకు పాడుపడే దిశగా ఆలోచించి ప్రజల ప్రాణాలు కాపాడే విధంగా గోదావరి బ్రిడ్జిపై ఫెన్సింగ్ ఏర్పాటు చేసేలా కృషి చేయాలని ఆయన డిమాండ్ చేశారు. నగర మేయర్ ప్రత్యేక శ్రద్ధ చూపి యుద్ధ ప్రాతిపాదికన నెల రోజుల్లో ఫెన్సింగ్ పనులు ప్రారంభించాలని ,లేనియెడల ఫెన్సింగ్ చేసేంత వరకు రాజకీయ పార్టీలకు అతీతంగా, స్వచ్ఛంద సంఘాల ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున పోరాటాలు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సామాజిక కార్యకర్తలు రేణిగుంట్ల నరేంద్ర, బూడిద హర్ష, వివేక్, వెంకటేష్, నివాస్, కార్తీక్, రాజు, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఫోర్టిఫైడ్ రైస్‌తో ఆరోగ్యానికి మేలు

### అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్



రాజన్న సిరిసిల్ల, ఏప్రిల్ 15 (మనం న్యూస్): రాజన్న సిరిసిల్ల జిల్లాలోని అన్ని రేషన్ షాపుల్లో ఈ నెల నుంచి పంపిణీ చేస్తున్న ఫోర్టిఫైడ్ రైస్ ప్రజల ఆరోగ్యానికి అన్ని విధాలా మేలు చేస్తుందని జిల్లా అదనపు కలెక్టర్ ఎన్.ఖీమ్యా నాయక్ తెలిపారు. శనివారం కలెక్టరేట్ లోని ఆయన ఛాంబర్‌లో ఫోర్టిఫైడ్ రైస్ వల్ల కలిగే ప్రయోజనాలను తెలుపుతూ ముద్రించిన గోడ పత్రికలను పౌర సరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ జితేంద్ర ప్రసాద్, జిల్లా పౌర సంబంధాల అధికారి మామిండ్ల దశరథంతో కలిసి ఆయన ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ నిరుపేదల్లో రక్తహీనత, పిల్లల్లో ఎదుగుదల లోపానికి చెక్ పెట్టేందుకు ప్రభుత్వం ఈ బృహత్తర కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందన్నారు. ప్రజా పంపిణీలో భాగంగా వినియోగదారులకు అందిస్తున్న సాధారణ రేషన్ బియ్యానికి బదులు పోషకాలున్న బలవర్ధక బియ్యం (ఫోర్టిఫైడ్ రైస్) పంపిణీని ఈ నెల నుంచే ప్రారంభించనున్నట్లు తెలిపారు. గతేడాది నుంచే మొదటి విడతగా కుమ్రంభీం ఆసిఫాబాద్, భద్రాద్రి కొత్తగూడెం, జయశంకర్ భూపాలపల్లి, ఆదిలాబాద్ జిల్లాల్లో ప్రయోగాత్మకంగా చేపట్టిన ఈ కార్యక్రమం సత్ఫలితాలు ఇవ్వగా, ఈ నెల నుంచి రాజన్న సిరిసిల్ల సహా మరో ఏడు జిల్లాలో రేషన్ షాపుల ద్వారా పంపిణీ చేయనున్నట్లు ఖీమ్యానాయక్ వివరించారు. బహిరంగ మార్కెట్‌లో కిలో 65 రూపాయలు ధర పలికే ఫోర్టిఫైడ్ రైస్‌ను ప్రజల ఆరోగ్యం దృష్ట్యా ప్రభుత్వం ఈ మొత్తాన్ని భరించి ప్రజలకు అందిస్తుందన్నారు. ఫోర్టిఫైడ్ రైస్ పట్ల ప్రజలకు అవగాహన కల్పించాలని జిల్లాలోని తహశీల్దార్‌లను ఆదేశించినట్లు తెలిపారు.

### మైత్రి గ్రూప్ చైర్మన్ జైపాల్ రెడ్డి ఆధ్వర్యంలో..

## మరో రెండు చలివేంద్రాలు ప్రారంభం



కరీంనగర్, ఏప్రిల్ 15 (మనం న్యూస్)ః మైత్రి గ్రూప్ చైర్మన్ కొత్త జైపాల్ రెడ్డి ఆధ్వర్యంలో కరీంనగర్ జిల్లా కేంద్రంలో మరో రెండు చలివేంద్రాలను శనివారం స్థానిక కార్పొరేటర్లు, జైపాల్ రెడ్డి మిత్ర మండలి సభ్యుల చేతుల మీదుగా ప్రారంభించారు. నగరంలోని ఎస్సారార్ కళాశాల బస్ స్టాప్‌తో పాటు నాక చౌరస్తా వద్ద రెండు చలి వేంద్రాలను ఏర్పాటు చేశారు. ఈ వేసవిలో ఎండల తీవ్రత అధికంగా ఉన్న నేపథ్యంలో ప్రజలు, ప్రయాణీకుల దాహార్తిని తీర్చే విధంగా నగరంలోని పలు ప్రాంతాల్లో మైత్రి గ్రూప్ ఆధ్వర్యంలో చలివేంద్రాలను ఏర్పాటు చేస్తున్నారు. ఇప్పటి వరకు కోర్టు చౌరస్తా, ఎస్సారార్ కాలేజీ బస్టాప్, నాకా చౌరస్తా వద్ద చలివేంద్రాన్ని ఏర్పాటు చేసిన జయపాలన్న మిత్ర మండలి ఆధ్వర్యంలో మరో 15 ప్రాంతాల్లో ఏర్పాటు చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ఎస్సారార్ కళాశాల బస్ స్టాప్ వద్ద ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని స్థానిక కార్పోరేటర్ బండ సుమా రమణారెడ్డి నాకా చౌరస్తాలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని సవేరా ఆరిఫ్‌జాఫ్రీ, అంజద్‌లాల్‌లు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మైత్రి ఛానల్ మేనేజింగ్ డైరెక్టర్ సుజన్‌రావు, మిత్రమండలి సభ్యులు అక్కినపల్లి నాగరాజు, వెంకట్ రెడ్డి, అనిత రెడ్డి, అడిచర్ల శ్రీనివాస్, వైద రామానుజం, వాసవేని శ్రీనివాస్, బి రెడ్డి కర్నాక్షర్ రెడ్డి, శేఖర్, కిషన్, శ్రీకాంత్, గుర్రం రాజిరెడ్డి, కరీమ్, అయూబ్ ఓ సామా, అంజద్‌లాలు, మాజీ కార్పొరేటర్ లింగంపల్లి శ్రీనివాస్, సవేర టీమ్ సభ్యులు పాల్గొన్నారు.



# ఫోటో గ్రాఫర్ల ప్లీనరీని విజయవంతం చేయండి

## జిల్లా ఫోటో గ్రాఫర్స్ అసోసియేషన్ అధ్యక్ష,ప్రధాన కార్యదర్శులు రెడ్డి భాస్కర్ ,పోగుల విజయ్‌కుమార్

పెద్దపల్లి(ప్రతినిధి),ఏప్రిల్ 15 మనం న్యూస్ : తెలంగాణ రాష్ట్ర ఫోటో,విడియో గ్రాఫర్స్ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 18 వ తేదీన హైదరాబాద్‌లోని శిల్పకళా వేదికలో నిర్వహించే ఫోటోగ్రాఫర్ల ప్లీనరిని విజయవంతం చేయాలని పెద్దపల్లి జిల్లా ఫోటో వీడియో గ్రాఫర్స్ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు రెడ్డి భాస్కర్,జిల్లా ప్రధాన కార్యదర్శి పోగుల విజయ్‌కుమార్‌లు పిలుపునిచ్చారు. శనివారం స్థానిక సిరి ఫంక్షన్ లో పెద్దపల్లి జిల్లా ఫోటో,వీడియో గ్రాఫర్స్ సంక్షేమ సంఘం జిల్లా స్థాయి కార్యదర్శి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్లీనరీ పోస్టర్లను ఆవిష్కరించారు. అనంతరం జిల్లా అధ్యక్షులు రెడ్డి భాస్కర్ ,జిల్లా ప్రధాన కార్యదర్శి పోగుల విజయ్ కుమార్లు మాట్లాడుతూ తెలంగాణలో ఫోటో గ్రాఫర్ల సమస్యలు,సంఘం అభివృద్ధి,భవిష్యత్ కార్యాచరణ కోసం ప్లీనరీ ఏర్పాటు చేయడం జరిగిందని అన్నారు. ఫోటో గ్రాఫర్ల సమస్యలపై చర్చించి పలు తీర్మానాలు చేయడం జరుగుతుందని అన్నారు. జిల్లాలోని రాష్ట్ర అసోసియేషన్ శాశ్వత సభ్యులు,జిల్లా కార్యవర్గ సభ్యులు, పట్టణ,మండల అసోసియేన్ల అధ్యక్షులు,ప్రధాన కార్యదర్శులు,కోశాధికారులు అధిక సంఖ్యలో తరలి రావాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా కోశాధికారి,పెద్దపల్లి మండల అధ్యక్షులు వనపర్తి శ్రీనివాస్,జిల్లా గౌరవ సలహాదారులు పల్లెర్ల ఉదయ్, తూర్పాటి జగన్,కుర్మ రమేష్‌బాబు,తాత రాజు,మహిళా విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డివిఆర్ తులసి,మహిళా విభాగం జిల్లా ఇంచార్జి రెడ్డి రోజా రాణి,అన్ని మండలాల అధ్యక్షులు,ప్రధాన కార్యదర్శి,కోశాధికారులతో పాటు జిల్లా కార్యవర్గ సభ్యులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



## పారమిత పాఠశాల విద్యార్థులకు బహుమతుల పంపిణీ



కరీంనగర్, ఏప్రిల్ 15 (మనం న్యూస్): స్థానిక పద్మనగర్‌లోని పారమిత హెరిటేజ్ పాఠశాలలో ఇటీవల నిర్వహించిన క్రీడల్లో గెలుపొందిన విద్యార్థులకు శనివారం బహుమతులు ప్రదానం చేశారు. ఈ విద్యాసంవత్సరానికి గాను పాఠశాలలోని విద్యార్థులను సబ్-జూనియర్, జూనియర్, సీనియర్ విభాగాలు గా విభజించి కబడ్డీ, ఖో-ఖో, అథ్లెటిక్స్, క్యారమ్స్, చెస్, వాలీబాల్ వంటి క్రీడలు నిర్వహించి గెలుపొందిన విద్యార్థులకు పతకాలు, బహుమతులు, సర్టిఫికెట్లు అందించే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ ఇ.ప్రసాద్‌రావు ముఖ్య అతిథిగా హాజరై విజేతలను అభినందించి బహుమతులను అందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యార్థుల జీవితంలో క్రీడలు ముఖ్య పాత్ర పోషిస్తాయన్నారు. విద్యార్థులు శారీరకంగా, మానసికంగా ధృడంగా తయారవడానికి క్రీడలు ఎంతో ఉపయోగపడతాయని తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్లు రశ్మిత, ప్రసూన, అనూకర్‌రావు, రాకేశ్, వినోద్‌రావు, వియుఎం.ప్రసాద్, ప్రిన్సిపాల్ సంజయ్ భట్టాచార్య, ప్రోగ్రాం హెడ్ గోపీకృష్ణ, సమన్వయకర్తలు లక్ష్మిదీప్తి, రబీంద్రపాత్రో, హరిప్రియ, ఉపాధ్యాయులు, విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

## రత్నాపూర్ అభివృద్ధికి రూ.10 లక్షల నిధులు మంజూరు



రామగిరి,ఏప్రిల్ 15 మనం న్యూస్ : రామగిరి మండలం రత్నాపూర్ గ్రామపంచాయతీకి స్పెషల డెవలప్మెంట్ ఫండ్ 2022-2023 కింద ముఖ్యమంత్రి కేసీఆర్,పెద్దపల్లి జిల్లా జడ్పీ చైర్మన్ పుట్ట మధుకర్ రూ.10 లక్షల నిధులు మంజూరు చేశారని సర్పంచ్ పల్లె ప్రతిమ పీవీరావు,ఎంపీటీసీ ధర్మల రాజసంపత్,ఉపసర్పంచ్ దుబ్బాక సత్యరెడ్డి,బిఆర్ఎస్ అధ్యక్షులు బాద్రాపు ప్రశాంత్‌రావు తెలిపారు. ఈ నిధులు ఎస్సీకాలనీ కండే లింగమ్మ ఇంటి దగ్గర సీసీ రోడ్డుకు రూ.2 లక్షలు,ధర్మల సంపత్ ఇంటి దగ్గర నుండి ఓల్డ్ సీసీ రోడ్డుకు రూ.1 లక్ష,రాంనగర్ రామగిరి హైస్కూల్ నుండి ఎస్.కే రఫీ ఇంటి వద్దకు సీసీ రోడ్డుకు రూ.2లక్షలు,ఆర్ అండ్ బి రోడ్డు నుండి శ్రీవరాల రాజయ్య, ఇంటి వద్దకు సీసీ రోడ్డుకు రూ.2లక్షలు,మెయిన్ రోడ్డు నుండి మన్నాల రాహులు ఇంటి వద్దకు సీసీ రోడ్డుకు రూ.లక్ష,రేగళ్ల రాయమల్లు ఇంటి వద్ద నుండి సింగర వేణి రవి ఇంటి వద్దకు సీసీ రోడ్డుకు రూ.1 లక్ష,మార్కొండ రాజేశ్వరి ఇంటి వద్ద నుండి సైడ్ వాల్ నిర్మాణం కొరకు రూ.1 లక్ష నిధులు మంజూరయ్యాయని తెలిపారు. నిధులు మంజూరు చేసినందుకు పెద్దపల్లి జడ్పీ చైర్మన్ పుట్ట మధుకర్‌కు వారు కృతజ్ఞతలు తెలిపారు.

# గంటకు ఘన సన్మానం

### ఉత్తమ ఆరోగ్య గ్రామంగా కల్వచర్ల ఎంపిక పట్ల సన్మానించినా భవన నిర్మాణ కార్మిక సంఘం



రామగిరి,ఏప్రిల్ 15 మనం న్యూస్ : రామగిరి మండలంలోని కల్వచర్ల గ్రామసర్పంచ్ గంట పద్మ వెంకట రమణారెడ్డి ని శనివారం పెద్దపల్లి జిల్లా భవన నిర్మాణ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ఘనసన్మానం చేశారు. ఉత్తమ ఆరోగ్య గ్రామంగా కల్వచర్ల గ్రామం ఎంపిక కావడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ భవిష్యత్తులో గ్రామాన్ని అన్ని రంగాల్లో అగ్రగామిగా నిలపెలా కృషి చేయాలని ఆకాంక్షించారు. ఉత్తమ ఆరోగ్య గ్రామపంచాయతీ అవార్డు వచ్చిన సందర్భంగా జిల్లా అధ్యక్షులు చిలువేరు స్వామి, మండల అధ్యక్షుడు షరీఫ్ ఆధ్వర్యంలో సర్పంచ్ గంట పద్మ వెంకట రమణారెడ్డి,ఉపసర్పంచ్ వేము కనకయ్యలకు సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో భవననిర్మాణ కార్మిక సంఘం నాయకులు బైరి శంకర్,కొయ్యడ సంపత్, కుసుమ సురేష్,వెంగళ రాములు,పురుమళ్ళ సమ్మయ్య, ఎల్లా వెంకటేష్,రాములు,అంజయ్య, రాయమల్లు, విష్ణువర్ధన్, సారయ్య, తిరుపతి, రోశయ్య, సంతోష్, భాస్కర్, రాజయ్య, కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## పలు బాధిత కుటుంబాలను పరిమర్శించిన మాజీ మంత్రి మంథని ఎమ్మెల్యే దుద్దిల్ల శ్రీధర్‌బాబు



ముత్తారం,ఏప్రిల్ 15 మనం న్యూస్ : ముత్తారం మండలం అడవిశ్రీరాంపూర్ గ్రామంలో సీనియర్ నాయకులు చాంద్‌పాషా రెండవ కోడలు అతీయా కౌసర్ మరణించగా శనివారం మాజీమంత్రి ఏఐసీసీ కార్యదర్శి మంథని శాసనసభ్యులు దుద్దిళ్ళ శ్రీధర్‌బాబు వారి పార్థీవ దేహానికి నివాళులు అర్పించి వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సంతాపం తెలిపారు. బిరుదు ప్రభాకర్ ఇటీవల మరణించగా వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు చొప్పరి సదానందం,ముత్తారం మండల కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు దొడ్డ బాలాజీ,కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ జిల్లా ఉపాధ్యాక్షుడు మద్దెల రాజయ్య,ముత్తారం సర్పంచ్ తూటి రజిత రఫీ,కోళ్ల విజయ్,గాదం శ్రీనివాస్,ఆకోజ్ ,అశోక్,దాసరి చంద్రమౌళి,సీనియర్ నాయకులు,కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## లబ్దిదారులకు సీఎం సహాయనిధి చెక్కుల పంపిణీ



ముత్తారం,ఏప్రిల్ 15 మనం న్యూస్ : ముత్తారం మండలంలోని పోతారం గ్రామంలో మంథని ఎమ్మెల్యే శ్రీధర్‌బాబు ఆదేశాల మేరకు మండల యూత్ కాంగ్రెస్ నాయకులు చెల్కల జితేందర్‌యాదవ్ ఆధ్వర్యంలో చెక్కులను లబ్ధిదారులకు అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా పోతారం గ్రామానికి చెందిన నాంసాని పవిత్రకు రూ.36000,.అడిచెర్ల లక్ష్మీ కాంతకు రూ.10500,ఉప్పు మల్లమ్మకు రూ.9000 విలువగల చెక్కులను శనివారం అందజేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పోతారం కాంగ్రెస్ గ్రామశాఖ అధ్యక్షుడు నర్ర మల్లయ్య,యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు కిరణ్,వార్డు సభ్యురాలు సిరారపు రాధ,సీనియర్ కాంగ్రెస్ నాయకులు మేకల ఓదెలు,చెల్కల కాంతయ్య, యూత్ కాంగ్రెస్ నాయకులు సిరారపు నరేష్,జంగిటి తిరుపతి,చెల్కల నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

## టూరిజం డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్‌ని సన్మానించి గ్రంథాలయ డైరెక్టర్


రామగిరి,ఏప్రిల్ 15 మనం న్యూస్ : శనివారం తెలంగాణ రాష్ట్ర టూరిజం డెవలప్మెంట్ కార్పొరేషన్ గా పదవి బాధ్యతలు స్వీకరిస్తున్న గెల్లు శ్రీనివాస్ యాదవ్ ని మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించి పుష్పగుచ్చం అందించి అభినందనలు తెలిపిన పెద్దపల్లి జిల్లా గ్రంథాలయ డైరెక్టర్ ఇజ్జగిరి రాజు (లడ్డు) ఉన్నారు.



# అగ్ని ప్రమాదాల నివారణపై ప్రచారం

## పెద్దపల్లి అగ్నిమాపక అధికారి శ్రీనివాస్

పెద్దపల్లి, ఏప్రిల్15(మనం ప్రతినిధి): అగ్ని ప్రమాదాల సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై జిల్లా వ్యాప్తంగా శనివారం విస్తృత ప్రచారం చేస్తున్నామని పెద్దపల్లి డివిజన్ అగ్నిమాపక అధికారి దేవనంది శ్రీనివాస్ తెలిపారు. అగ్నిమాపక వారోత్సవాలలో భాగంగా రెండవ రోజు అగ్ని ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన చర్యలు, అగ్ని మాపక సమయంలో నియంత్రణకు చేయాల్సిన కార్యాచరణపై జిల్లాలోని ముఖ్య కూడలిలో అవగాహన కార్యక్రమాలను నిర్వహించారు. ఈసందర్భంగా పెద్దపల్లి డివిజన్ అగ్నిమాపక అధికారి శ్రీనివాస్ మాట్లాడుతూ అఖిల భారత అగ్నిమాపక వారోత్సవాల సందర్భంగా రెండవ రోజు పెద్దపల్లి పట్టణంలోని బస్టాండ్, రైల్వే స్టేషన్‌లలో అగ్ని ప్రమాదాలు సంబవించుటకు గల కారణాలు, అగ్ని ప్రమాదాల నివారణ చర్యలపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ పోస్టర్లు, కరపత్రాలను పంపిణీ చేశారు. అగ్నిమాపక సిబ్బంది వివిధ సాధనలతో డెమో నిర్వహించి ప్రజలను చైతన్య పర్చామని ఆయన పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో అదనపు ప్రధాన అగ్నిమాపకుడు బి.శ్రవణ్ కుమార్, వాహన చోదకుడు జి.శ్రీనివాస్, అగ్నిమాపకుడు పి.నరేందర్, తదితరులు పాల్గొన్నారు.






## అధిక శాతం తేమలేకుండా పత్తిని మార్కెట్ తీసుకరావాలి

### పెద్దపల్లి జిల్లా మార్కెటింగ్ అధికారి ప్రవీణ్‌రెడ్డి



పెద్దపల్లి ,ఏప్రిల్ 15(మనం ప్రతినిధి)అధిక శాతం తేమలేకుండా పత్తిని వ్యవసాయ మార్కెట్ యార్డుకు తీసుకరావాలని పెద్దపల్లి జిల్లా మార్కెటింగ్ అధికారి ప్రవీణ్‌రెడ్డి శనివారం తెలిపారు. వ్యవసాయ మార్కెట్ యార్డుకు తీసుకవచ్చే పత్తి రైతులు 12శాతం తేమకు మించి ఉంచకుండా ఉన్న పత్తిని మాత్రమే ఉదయం 8.30గంటల లోపు మాత్రమే మార్కుట్ యార్డుకు తీసుకరావాలని జిల్లా మార్కెటింగ్ అధికారి ప్రవీణ్‌రెడ్డి అన్నారు. అలాగే పత్తిలో తేమ ఎక్కువగా ఉంటే గెటు వద్ద తేమ కొలిచే యంత్రంలో పత్తి తేమ చూడబడునని, అధికంగా తేమ ఉంటే గేటు వద్ద నుండే పత్తి వాహనాలను వెనక్కి పంపించడం జరుగుతుందని, ఎట్టి పరిస్తితిలో అధిక తేమ పత్తిని మార్కెట్ యార్డులో కొనుగోలు చేయరని, రైతులు ఇట్టి విషయాన్ని గమనించి 12శాతం తేమ ఉన్న పత్తిని మాత్రమే తీసుకొని వచ్చి క్రయవిక్రమాలు సజావుగా ఎటువంటి ఇబ్బందులు లేకుండా జరుపుటకు సహకరించాలని పత్తి రైతులను ఆయన కోరారు.

## కౌన్సిలర్‌కు ప్రగాడ సానుభూతి తెలిపిన ఎమ్మెల్యే



పెద్దపల్లి,ఏప్రిల్15(మనం ప్రతినిధి): పెద్దపల్లి పట్టణంలోని 16వ వార్డు కౌన్సిలర్ రాజమహంత క్రిష్ణ తండ్రి శుక్రవారం స్వర్గసులైనారు. ఈవిషయం తెలుసుకున్న ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి శనివారం ఆయన నివాసానికి వెళ్లి కౌన్సిలర్‌కు వారి కుటుంబ సభ్యులను కలిసి పరామర్శించి, ప్రగాఢ సానుభూతి తెలిపారు.

## ఇంగ్లీష్ కోర్సును సద్వినియోగం చేసుకోవాలి




హుజూరాబాద్‌రూరల్, ఏప్రిల్ 15,(మనంన్యూస్) : ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రారంభమైన ఇంగ్లీష్ కోర్సును ఆసక్తి గల విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి. ఇందిరాదేవి కోరారు. శనివారం కళాశాలలో ఇంగ్లీష్ డిపార్ట్‌మెంట్ హెడ్ డా.పాలకుర్తి దినకర్ ఆధ్వర్యంలో ఇంగ్లీష్ ఫర్ కాంపిటిటివ్ ఎగ్జామ్స్‌కు సంబంధించిన కోర్సును ప్రారంభించారు. ఈ కోర్సు పోటీ పరీక్షలకు సన్నద్ధమవుతున్న వారికి ఎంతోఉప యోగకర ంగా ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ లక్ష్మీ నరసింహమూర్తి, పూర్వ ప్రిన్సిపాల్ గొడిశాల పరమేష్, అకడమిక్ కోఆర్డినేటర్ శ్రీనివాస్, స్టాఫ్ సెక్రటరి రమేష్, ఉపన్యాసకులు మధు, ఉయదశ్రీ, శ్యామాలాదేవి, హరిప్రసాద్, సమ్మయ్య, స్వప్న, పాషా, రాజ్‌కుమార్, శ్రీలత, స్పందన విద్యార్థులు పాల్గొన్నారు.

## బియ్యం అందజేత

హుజూరాబాద్‌రూరల్, ఏప్రిల్ 15,(మనంన్యూస్) : మండలంలోని రాజాపల్లి గ్రామానికి చెందిన శనిగరపు శ్రీనివాస్ ఇటీవల గుండెపోటుతో మృతి చెందగా వారి కుటుంబానికి జమ్మికుంట పట్టణానికి చెందిన ప్రముఖ కళాకారుడు, నంది అవార్డు గ్రహిత అంబాల ప్రభాకర్, పబ్బు శ్రీనివాస్, మహమ్మద్ రంజాన్, వజ్ర కృష్ణమూర్తి, మనోహర్‌లు పరామర్శించారు.మృతి పట్ల ప్రగాఢ సానుభూతి, సంతాపాన్ని వ్యక్తం చేశారు. అనంతరం క్వింటాళ్ బియ్యాన్ని అందజేశారు. వీరి వెంట రవీందర్, అంబాల రాజు, బీఎస్పీ జిల్లా కన్వీనర్ మిడిదొడ్డి స్వప్న తదితరులు ఉన్నారు.

